సాక్షి ఏలూరు

ఆదివారం । 10 । మార్చి । 2024




పోషకాహార పక్షోత్సవాలు

యలమంచిలి: పోషకాహార ఆవశ్యకతను తెలియజేసేలా ఈనెల 9 నుంచి 23 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. యలమంచిలిలో మానవహారం చేపట్టారు.



ఘనంగా తెప్పోత్సవం

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయ సమీపంలోని కోనేరులో శివరాత్రి వేడుకల్లో భాగంగా తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది.



వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

పట్టిసం ఆదాయం రూ.27 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించినట్టు ఈఓ ఎస్.సంగమేశ్వర వర్మ తెలిపారు. రూ.300 టికెట్ల ద్వారా రూ.4.86 లక్షలు, రూ.50 టికెట్ల ద్వారా రూ.3.90 లక్షలు, రూ.20 టికెట్ల ద్వారా రూ.2.63 లక్షలు, తలనీలాలు టికెట్ల ద్వారా రూ.1,100, హుండీల ద్వారా రూ.12.48 లక్షలు, కొబ్బరి చెక్కల అమ్మకం ద్వారా రూ.1.18 లక్షలు, తలనీలాల ద్వారా రూ.6,600, అన్నదానం విరాళాల రూపంలో రూ.2.74 లక్షలు మొత్తంగా రూ. 27,86,942 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని మూడు కస్తూరిబా బాలికా విద్యాలయాలు (కేజీబీవీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త బి.సోమశేఖరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కుక్కునూరు, వేలేరు, వేలేరుపాడులోని విద్యాలయాల్లో 6, 11 తరగతుల్లో ప్రవేశాలకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అలాగే 7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లను కూడా భర్తీ చేస్తామని తెలిపారు. బాలికలు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుక్కునూరులో 6వ తరగతిలో 40, 11వ తరగతి బైపీసీలో 40 సీట్లు, వేలేరులో 6వ తరగతిలో 40, 11వ తరగతి ఎంపీసీలో 40 సీట్లు, వేలేరుపాడులో 6వ తరగతిలో 40, 11వ తరగతి హెచ్‌ఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాలకు ఆర్టీఈ టోల్‌ఫ్రీ నంబర్ 18004258599లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 14,524 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 51 కేంద్రాల్లో మ్యాథ్స్–1 బీ, జువాలజీ, హిస్టరీ–1 పరీక్షలకు 15,286 మందికి 14,524 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 12,985 మంది జనరల్ విద్యార్థులకు 12,519 మంది, 2,301 మంది ఒకేషనల్ విద్యార్థులకు 2,005 మంది హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

'పశ్చిమ'లో..

భీమవరం: జిల్లాలో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పరీక్షల కన్వీనర్ కె.చంద్రశేఖర్ బాబు తెలిపారు. జనరల్, ఒకేషనల్ కేటగిరీల్లో 17,590 మంది విద్యార్థులకు 16,962 మంది హాజరయ్యారన్నారు.

టీడీపీలో అసమ్మతి రాగం

పొత్తు ప్రకంపనలు

- తమ్ముళ్లకు చంద్రబాబు షాక్
- జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని సీటు గల్లంతు!
- అదే బాటలో పోలవరం, తాడేపల్లిగూడెం సీట్లు!
- పొత్తు స్థానాల ఇన్‌చార్జులకు బాబు ఫోన్లు
- పోలవరం, తాడేపల్లిగూడెంలో భగ్గుమన్న అసంతృప్తి
- ఉంగుటూరులో పూర్తయిన అసమ్మతి సమావేశం
- భీమవరం, నరసాపురంలో గందరగోళం
- జనసేన అభ్యర్థుల పేర్లతో హడావుడిగా సర్వేలు



సీటు లేదు సారీ అంటూ..

సీటు లేదు సారీ అంటూ వరుస ఫోన్లు టీడీపీ ఇన్‌చార్జులకు వస్తున్నాయి. అధికారికంగా పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జులకు రాగా నరసాపురం, భీమవరం ఇన్‌చార్జులకు స్పష్టమైన సంకేతాలు ఇంతకు ముందే ఇచ్చారు. శనివారం తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జి నియోజకవర్గ సమావేశం నిర్వహించి పొత్తులపై ముందే చెబితే బాగుంటుంది, కోట్లు ఖర్చుపెట్టి హడావుడి చేసిన తర్వాత పొత్తు పేరు చెప్పి సీటు గల్లంతు చేయడం సరికాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని చెప్పారని ప్రకటించుకున్నారు. ఇక పోలవరానికి సంబంధించి ఎలాంటి హామీ లేకుండా సీటు జనసేనదేనని తేల్చిచెప్పారు. మొత్తం మీద పొత్తు స్థానాలు జనసేన ప్రకటించకుండానే చంద్రబాబు లీక్స్‌తో టీడీపీ శ్రేణులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నాయి. ఉంగుటూరు నియోజకవర్గ టికెట్‌ను తెలుగుదేశం పార్టీకే కేటాయించాలని కోరుతూ ఆదివారం నియోజకవర్గ ముఖ్య నాయకులు చంద్రబాబును కలవనున్నారు. ఈ సీటును జనసేనకు కేటాయించవద్దని చంద్రబాబు దృష్టికి బలంగా తీసుకువెళ్లనున్నారు.

సాక్షి ప్రతినిధి,ఏలూరు: తెలుగుదేశం పార్టీ, జనసేన పొత్తు ప్రకంపనలు ఉమ్మడి పశ్చిమగోదావరిలో కాకరేపాయి. ఏళ్ల తరబడి నుంచి టికెట్ ఆశిస్తూ పని చేస్తున్న ముఖ్య నేతలందరికీ బలంగా హ్యాండ్ ఇచ్చారు. విచిత్రమేమిటంటే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షుల సీట్లు కూడా నూరుశాతం గల్లంతవ్వడం విశేషం. అధికారికంగా జనసేన, టీడీపీ సీట్లు ప్రకటించకపోయినా చంద్రబాబు జనసేనకు కేటాయించిన స్థానాల టీడీపీ ఇన్‌చార్జులకు ఫోన్ చేసి జనసేన పార్టీకి పనిచేయండని చెప్పడంతో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. రెండు రోజుల క్రితం ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అసమ్మతి సభ నిర్వహించగా.. శనివారం పోలవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో అసమ్మతి సెగల నడుమ సమావేశాలు వాడీవేడిగా సాగాయి.

వరుస పెట్టి ఫోన్లు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వరుస పెట్టి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జులకు ఫోన్లు చేస్తున్నారు. గత రెండు రోజుల్లో పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జులకు ఫోన్లు చేసి 'సారీ' చెప్పగా అంతకు ముందే భీమవరం, నరసాపురం ఇన్‌చార్జులకు పరోక్ష సంకేతాలిచ్చి సీట్లు తమవి కాదని తేల్చారు. దీంతో పాటు నరసాపురంలో పొత్తుల్లో భాగంగా జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, కొత్తపల్లి సుబ్బారాయుడుల్లో ఎవరైతే బాగుంటుందని సర్వే కూడా మొదలుపెట్టేశారు. అలాగే భీమవరం నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పవన్‌కళ్యాణ్‌తో భేటీ అయి జనసేన నుంచి తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించేసుకున్నారు. పార్టీలో చేరకుండానే జనసేన కార్యక్రమాలకు ఆయన హాజరవుతున్నారు. ఈ తాజా పరిణామాలతో ఉమ్మడి జిల్లాలో టీడీపీలో గందరగోళం రేగింది.

భగ్గుమంటున్న తమ్ముళ్లు

నామమాత్రపు బలం లేని జనసేనకు ఏలూరు, నరసాపురం పార్లమెంట్ స్థానాల పరిధిలో ఐదు అసెంబ్లీ సీట్లు ఇవ్వడమేంటని, వారి స్థాయి ఎంత, ఓటింగ్ ఎంత, ఆర్థిక బలం లేని వాళ్లను ఎందుకు నెత్తిన పెట్టుకోవాలంటూ టీడీపీ కేడర్ భగ్గుమంటోంది. రెండు రోజులు క్రితం ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులకు ఎటువంటి సమాచారం లేకుండా సీటు గల్లంతు చేశారు. ఎల్లో మీడియా కథనాలు చూసి పార్టీ ముఖ్యులతో సీటు గల్లంతైన విషయాన్ని ధ్రువీకరించుకుని వీరాంజనేయులు హడావుడిగా భీమడోలులో సమావేశం నిర్వహించి తమ సత్తా పార్టీకి తెలియజేయాలని, భారీగా కార్ల ర్యాలీ నిర్వహించి ఉంగుటూరు సీటు జనసేనకు ఇవ్వవద్దని డిమాండ్ చేయాలని నిర్ణయించారు. అయితే చంద్రబాబు నుంచి ఫోన్ రావడంతో గన్ని ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది.

అత్యవసర సమావేశాలు

తాజాగా పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిలకు కూడా చంద్రబాబు నుంచి ఫోన్లు వచ్చాయి. అందరికీ ఫోన్ చేసి 'ఎవరూ పార్టీని తిట్టవద్దు.. నన్ను విమర్శించవద్దు.. పొత్తు ధర్మాన్ని పాటించి జనసేనకు పనిచేయండి' అని చంద్రబాబు చెప్పడంతో టీడీపీ కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటుంది. పార్టీ గీత దాటవద్దంటూనే ఇన్‌చార్జులు పార్టీ నియోజకవర్గ అత్యవసర సమావేశాలు నిర్వహించి వాళ్లు మాట్లాడకుండా కేడర్‌తో పార్టీని తిట్టించటం విశేషం.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



తణుకులో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: సంక్షేమం, అభివృద్ధి పారదర్శకంగా అందాలంటే మరలా మీ బిడ్డ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో పట్టణ పరిధిలో రూ.6.21 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్డు అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమం, అభివృద్ధి పనులను పారదర్శకంగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో రుణమాఫీలతోపాటు అవసరమైన భవన నిర్మాణాలన్నీ పూర్తి చేశామని, ప్రజల దీవెనలతో మరలా తమ ప్రభుత్వం రాగానే మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఏంటో ప్రజలకు చూపిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి పథంలో తణుకును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

కొమరవరంలో అభివృద్ధి పనులు

తణుకు టౌన్: కొమరవరంలో నాడు–నేడులో నిర్మించిన ప్రాథమిక పాఠశాల, రైతు భరోసా కేంద్రం, సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోడౌన్, సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా లోటు బడ్జెట్ ఉండేదని లోకేష్ చెబుతున్నారని, అయితే సీఎం జగన్ అదే బడ్జెట్‌తో పేదలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తున్నారన్నారు. విద్యారంగంలో రూ.72 వేల కోట్లు వెచ్చించారన్నారు. అనంతరం ప్రజా దీవెన పాదయాత్ర, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహించారు.

కమనీయం.. కడు రమణీయం



వేదికపై తిరుమల శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

నేత్రపర్వంగా తిరుమలేసుని కల్యాణం

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ శాఖ నిర్వహణలో ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మప్రచార మహోత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెంలో బలుసులమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద శనివారం రాత్రి తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మాదిరిగా ఇక్కడ ఉదయం నుంచి శ్రీవారి సేవలు, రాత్రి కల్యాణం జరిపించారు. తిరుమల దేవస్థానం ప్ర ధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు స్వయంగా కళ్యాణ తంతు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు భారీ ఏర్పాట్లు చేశారు. మంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామని కుమారి దంపతులు, కొట్టు విశాల్ దంపతులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

- నాడు–నేడులో రూ.17.88 కోట్లు మంజూరు
- పాఠశాలల నిర్వహణకు రూ.7.45 కోట్లు
- నిధుల వినియోగానికి ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు



నాడు.. శీతనపల్లి ఎంపీపీ పాఠశాల



నేడు.. అభివృద్ధి చెందిన శీతనపల్లి ఎంపీపీ పాఠశాల

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద సర్కారీ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేసింది. నాడు–నేడు తొలివిడతలో ఉమ్మడి పశ్చిమగోదావరి ప్రాతిపదికన, రెండో విడతలో విభజిత ఏలూరు జిల్లా ప్రాతిపదికన సుమారు 2 వేలకు పైగా బడుల రూపురేఖలు మార్చివేశారు. మొదటి విడతలో జిల్లాలోని 1,117 పాఠశాలలను రూ.280.44 కోట్లతో అభివృద్ధి చేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, శ్లాబులు, గోడల మరమ్మతులు, ప్రహరీల నిర్మాణం, మరుగుదొడ్ల సౌకర్యం, పరిశుభ్రమైన తాగునీటి సరఫరా, తగరతి గదుల్లో గ్రీన్ చాక్‌బోర్డుల ఏర్పాటు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, తరగతి గదుల్లో గోడలకు పెయింటింగ్, క్రీడా ప్రాంగణాల అభివద్ధి, ప్రహరీలపై విజ్ఞానాన్ని పెంచేలా, విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించేలా చూడచక్కని బొమ్మలు వేయించారు.

889 పాఠశాలల్లో.. రెండో విడత నాడు–నేడు కింద ఏలూరు జిల్లాలో 889 పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి రూ.295.54 కోట్లతో పనులు ప్రారంభించారు. ముందుగా రూ.112. 64 కోట్లను విడుదల చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆ నిధులన్నీ వినియోగించిన అనంతరం గత వారంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం రూ.17.88 కోట్లను ఆయా పాఠశాలల ఖాతాలకు ప్రభుత్వం జమచేసింది. దీంతో ఆయా పాఠశాలల్లో నాడు–నేడు పనులు వేగం పుంజుకున్నాయి. ఈ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు, తాగునీటి సదుపాయం, విద్యుదీకరణ పనులు, ఫర్నిచర్ మరమ్మతులు చేపట్టనున్నారు.

పాఠశాలల నిర్వహణకు.. పాఠశాలల నిర్వహణ నిమిత్తం స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌గా జిల్లాలోని పాఠశాలల ఖాతాలకు రూ.7.45 కోట్లను విడుదల చేశారు. వీటితో నాడు–నేడులో ఎంపిక కాని పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ మరమ్మతులు, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ల నిర్మాణం, పాఠశాలల తలుపులు, కిటికీల మరమ్మతులు, గోడలు, శ్లాబ్, ఫ్లోర్ మరమ్మతులు, ప్లంబింగ్ పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు.

నిధులు సక్రమంగా వినియోగించాలి



ప్రతి పాఠశాలలో ఎటువంటి మరమ్మతు పనులు మిగిలి ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహణ నిధులు విడుదల చేసింది. వీటిని సక్రమంగా వినియోగించుకోవాలి. పాఠశాలల్లో మౌలిక వసతులు, సౌకర్యాలు లేవనే ఫిర్యాదులు రాకూడదు. పాఠశాలల్లో మరమ్మతులు చేయించాల్సి ఉన్నా నిధులు వినియోగించకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడం వంటివి చేస్తే హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటాం.

– బి.సోమశేఖరరావు, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్

ప్రాధాన్యతా క్రమంలో..



పాఠశాల నిర్వహణ నిధులను ప్రాధాన్యతా క్రమంలో వినియోగించాలి. మేజర్, మైనర్ మరమ్మతులతో పాటు నిర్దేశించిన పనుల కోసం వెచ్చించాలి. అలాగే ప్రతి పాఠశాలలో నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలి. ఐఎఫ్‌పీలు పనిచేయాలంటే కనీసం 60 ఎంబీపీఎస్ స్పీడ్‌తో నెట్ సౌకర్యం కావాల్సి ఉంది. దీనిని ఏర్పాటు చేసుకోవడం కోసం అవకాశం ఉన్నంత వరకూ ప్రైవేట్ నెట్‌లను ఉపయోగించుకోవాలి.

– ఎస్.అబ్రహం, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి

శోభాయమానంగా రథోత్సవం

భీమవరం(ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా స్వామి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి పురవీధుల్లో ఊరేగించారు. విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి ఈవీ సుబ్బారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు, ధర్మకర్తలు చెల్లబోయిన సూర్యప్రకాష్, కుర్మదాసు సత్యశ్రీనివాస్, తాణాల రామకృష్ణ, నాచుశ్రీవల్లి, నల్లం రఘుబాబు, సోమాదుల లీలాఈశ్వరీ, లక్కు త్రిమూర్తులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భీమవరంలో ఉమాసోమేశ్వరస్వామి రథోత్సవం



పాలకొల్లులో రావణ బ్రహ్మ వాహనంపై గ్రామోత్సవం

హరోంహర.. శంభో శంకర

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్న పాగాను వరదా సోమేశ్వరరావు ఆలయ అర్చకులకు అందించగా ప్రత్యేక పూజలు చేసి ఆలయ శిఖరం నుంచి గాలి గోపురం శిఖరం వరకు పాగాను అలంకరించారు. అనంతరం భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో లక్షపత్రి పూజ చేశారు. శనివారం సాయంత్రం రావణ బ్రహ్మ వాహనంపై పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీ జనార్దనస్వామి వార్ల గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. వాహనం ముందు గాదె జనార్దనగుప్త కుటుంబ సభ్యులు కుంభం పోసి నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, అర్చకులు కిష్టప్ప, అనిల్, పూర్ణయ్య, సోమేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారా బట్టీలపై దాడి..

1800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



అరెస్టు చేసిన నిందితులతో ఎస్‌ఈబీ సిబ్బంది

నూజివీడు : చాట్రాయి మండలం పోలవరంలో సారా బట్టీలపై శనివారం దాడి చేసి 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ శనివారం చెప్పారు. పోలవరం గ్రామానికి చెందిన వెలివెల తరుణ్, బి.జీవన్‌కుమార్‌లను అరెస్టు చేశామన్నారు. మరో నిందితుడు పజ్జూరి బాలకృష్ణ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతనిని పట్టుకుంటామన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్టప్రకారం నేరమేనని, చట్ట విరుద్ధ పనులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కైకలూరులో చైన్ స్నాచింగ్

కైకలూరు: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో శనివారం రాత్రి చైన్‌స్నాచింగ్ ఘటన జరిగింది. మహిళా ఉద్యోగి మెడలో 3 కాసుల బంగారపు గొలుసును ద్విచక్రవాహనంపై వచ్చి దుండగుడు తెంచుకుపోయాడు. వివరాలిలా ఉన్నాయి. టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కైకలూరుకు చెందిన గోళ్ల జగదాంబ ఏలూరు కలెక్టరేట్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. శనివారం రాత్రి ఇంటికి వెళుతుండగా, ద్విచక్ర ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ ఆగంతకుడు ఆమె మెడలో గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన్యంలో రోడ్లకు మహర్దశ

- మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి
- శివారు గ్రామాల్లోనూ అందుబాటులోకి రహదారి సౌకర్యం
- 'గడపగడపకు' నిధులతో గ్రామాల్లో చురుగ్గా సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణాలు
- గిరిజన ప్రాంతవాసుల్లో హర్షాతిరేకాలు





ఇప్పలపాడులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి (ఫైల్)

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఏళ్ల తరబడి కనీస నిర్వహణకు నోచుకోని రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతోపాటు పార్టీ నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలోను సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని ప్రజలు విన్నవించుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి కేటాయించిన రూ.40 లక్షల నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు నానా అవస్థలు పడేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన్యప్రాంతానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో రహదారులకు మోక్షం కూడా కలిగింది. ఆర్ అండ్‌బీ పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పలు గ్రామాలకు బీటీ రోడ్లు కూడా నిర్మించారు. దీనితో ఏజెన్సీ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐటీడీఏ ద్వారా రూ.40.55 కోట్ల వ్యయంతో 36 బీటీ రోడ్ల పనులు

కేఆర్‌పురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా గిరిజన ప్రాంతంలోని సుమారు 36 బీటీ రోడ్ల పనులు చేపట్టారు. ఈ పనులకు సుమారు రూ.40.55 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో అధికారులు పలు గ్రామాల్లో పనులు పూర్తి చేశారు. ఇంకా పలు పనులు జరుగుతున్నాయి.

రూ.42.80 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 107 సచివాలయాల పరిధిలో సుమారు రూ.42.80 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయి. ఈ పనులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతోపాటు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి, పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయ కర్త కారుమూరి సునీల్‌తోపాటు అధికారులు కూడా ప్రారంభోత్సవాలు చేశారు.

రూ.59.30 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా మరో 6 రోడ్లు

ఏజెన్సీ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా సుమారు 6 రోడ్లను రూ.59.30 కోట్లతో చేపట్టారు. అందులో కొన్ని రోడ్లు పూర్తి కాగా, మిగిలిన చోట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక శివాలయం నుంచి దొరమామిడి వరకూ రోడ్డు పనులు పూర్తయ్యాయి. అదేవిధంగా ఇటుకుల కోట అడ్డ రోడ్డు నుంచి రెడ్డికోపల్లి అటవీ ప్రాంతంలోని గ్రామం వరకూ రోడ్డు పనులు పూర్తయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా చేపట్టిన పనుల్లో జోడుమామిడి వరకూ పనులు పూర్తయ్యాయి. అలాగే కె.బొత్తప్పగూడెం నుంచి రావిగూడెం వరకూ రోడ్ల నిర్మాణం పూర్తయింది. పోలవరం నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయి.



ఇటుకుల కుంట అడ్డరోడ్డు నుంచి రెడ్డికోపల్లి వరకు నిర్మించిన రోడ్డు



అలివేరు నుంచి జోడుమామిళ్ల వరకు నిర్మించిన రోడ్డు



పోగొండ అడ్డరోడ్డు నుంచి తూర్పు పాలకుంట వరకు..



ఇప్పలపాడులో నిర్మించిన సీసీ రోడ్డు



బుట్టాయగూడెం నుంచి కృష్ణాపురం వరకూ..



బుట్టాయగూడెం నుంచి దొరమామిడికి నిర్మించిన రహదారి

గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కృషి



గిరిజన ప్రాంత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులతో రూపురేఖలు మారాయి. ఇంకా కొన్నిచోట్ల పనులు జరగవలసి ఉంది. రాబోయే రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేసేలా కృషి చేస్తాం. – **తెల్లం రాజ్యలక్ష్మి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, పోలవరం**

మా కష్టాలు తీరాయి



గతంలో మా గ్రామాల్లో వర్షాలు వస్తే బురదరోడ్లతో ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం సీసీ రోడ్లు నిర్మించడం వల్ల కష్టాలు తీరాయి. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్లు నిర్మించాలని కోరిన వెంటనే 7 సీసీ రోడ్ల పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. రోడ్లు అభివృద్ధి చేయడంతో నాకు చాలా ఆనందం కలిగింది. – **జోడే సత్యదుర్గాప్రసాద్, సర్పంచ్, గాడిదబోరు, బుట్టాయగూడెం మండలం**

రోడ్లు బాగుపడ్డాయి



రోడ్డు నిర్వహణ పనులు చురుగ్గా పూర్తయ్యాయి. సీసీ రోడ్డు కూడా పూర్తి కావడంతో రహదారి సమస్యలు తీరాయి. సంక్షేమంపై దృష్టి పెట్టిన జగనన్న తదుపరి రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. దీంతో మా గ్రామాల్లో రోడ్డు నిర్మాణాలు పూర్తి కావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. – **ఉయికే బొజ్జి, సర్పంచ్, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం**

ఎన్నికల నిర్వహణపై స్పష్టత అవసరం

రిటర్నింగ్ అధికారులకు శిక్షణలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో) : ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులకు ఒక రోజు శిక్షణ తరగతులను శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గానికి ఆర్వో, ఏఆర్వోలను నియమించామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, బ్యాలెట్ పేపర్ల తయారీ, కౌంటింగ్ వంటి కీలకమైన బాధ్యతలు రిటర్నింగ్ అధికారులపై ఉంటాయన్నారు.

'హ్యాండ్ బుక్' క్షుణ్ణంగా చదవాలి

రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ అందజేసిన 'హ్యాండ్ బుక్' లోని ప్రతి చాప్టర్‌ను క్షుణ్ణంగా చదవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మరుక్షణం నుంచి ఆయా కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల చిత్రపటాలు, ఇతర వాల్ పోస్టర్లను తాత్కాలికంగా తొలగించాలన్నారు. మరణించిన ప్రముఖ నాయకులకు సంబంధించిన విగ్రహాలకు ముసుగు వేయనవసరం లేదని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులను కలిసే ప్రయత్నాలను ఎంత మాత్రం చేయరాదన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించొద్దు

జేసీ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కడా ఉల్లంఘించకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ పోస్టుల పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికలకు నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించిన డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు నామినేషన్ ప్రక్రియపై, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, సర్వశిక్షా అభియాన్ ఏపీసీ బి.సోమశేఖర్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదిని సింగ్, రిటైర్డ్ రెవెన్యూ అధికారి చక్రపాణి పోస్టల్ బ్యాలెట్‌పై, ఈవీఎం, ఐటీ అప్లికేషన్స్‌పై జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, ఎన్ఐసీ శర్మ వివరించారు. ఈవీఎం మెషీన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో డి.పుష్పమణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, రిటర్నింగ్ అధికారులైన ఆర్డీఓలు భవాని శంకరి, కె.అద్దయ్య, ఎన్ఎస్‌కే ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ముక్కంటి, భాస్కర్, కలెక్టరేట్ ఏవో కె.కాశీ విశ్వేశ్వరరావు, ఏపీఐసీసీ జెడ్ఎం కె.బాబ్జీ పాల్గొన్నారు.


ప్రశాంతంగా అంజుమన్ ఎన్నికలు



ఓటు వేసేందుకు బారులు తీరిన ముస్లింలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ప్రతిష్టాత్మక ముస్లిం సంస్థ అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం పాలక మండలి ఎన్నిక నిమిత్తం శనివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. సంస్థకు వన్‌టౌన్‌లో 7, టూటౌన్‌లో 7, త్రీటౌన్‌లో ఒకటి మొత్తం 15 జోన్లు ఉండగా వన్ టౌన్ పరిధిలో 13 పాలక మండలి సభ్యులు, టూటౌన్‌లో 20 పాలక మండలి సభ్యులు, త్రీ టౌన్‌లో రెండు పాలక మండలి సభ్యుల స్థానాలు ఉన్నాయి. మొత్తం 68 నామినేషన్లు దాఖలు కాగా, ఐదుగురు విరమించుకున్నారు. మిగిలిన వారిలో వన్‌టౌన్ నుంచి ముగ్గురు, టూటౌన్ నుంచి నలుగురు మొత్తం ఏడుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మిగిలిన 56 పాలక మండలి సభ్యుల ఎన్నిక కోసం శనివారం ఎన్నికలు నిర్వహించారు. కత్తేపు వీధి సభ్యుని పదవికి అత్యధికంగా 11 మంది పోటీ పడ్డారు. 2,773 మందికి ఓటు హక్కు ఉంది. ఎన్నికల ప్రక్రియ ముగియగా, కోర్టు ఆదేశాల మేరకు కౌంటింగ్‌ను నిలిపివేశారు. ఎన్నికల ప్రక్రియపై నివేదికను ఎన్నికల అధికారులు ఈ నెల 11న కోర్టుకు సమర్పించిన అనంతరం కోర్టు తీర్పు అనంతరమే కౌంటింగ్, నూతన పాలక మండలి ఎన్నిక అనే అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా న్యాయవాది చదలవాడ వెంకట రమణ, సహాయ ఎన్నికల అధికారిగా ఉప్పులూరి హేమ శంకర్ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో ప్రస్తుత పాలక మండలి సభ్యులతో పాటు గతంలో పాలక మండలిలో ఉన్న సభ్యులు, కొత్తగా మరో వర్గం నాయకులు ఇలా మూడు వర్గాలు అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ పడుతుండడంతో ఫలితాలపై ముస్లిం వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

కమనీయం.. బలివే రామలింగేశ్వరుని కల్యాణం



బలివేలో ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించిన దృశ్యం

బలివే (ముసునూరు): భక్తుల శివనామ స్మరణలు, పురోహితుల వేదమంత్రోచ్చారణ, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ బలివే తీర్థ క్షేత్రంలోని శ్రీరామలింగేశ్వరుని కల్యాణం శుక్రవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీస్వామివారిని పెండ్లి కుమారునిగా ముస్తాబు చేసి అర్చకులు అరుణ భాస్కర్, అమర్ బాబుల బృందం స్వామివారి కల్యాణ క్రతువు కనుల పండువగా నిర్వహించారు. అశేష భక్తజనం కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారు పుష్ప మాలాంకృతులై పల్లకీలో కిలోమీటరు దూరంలో ఉన్న మహా ప్రసిద్ధ మృత్యు మల్లేశ్వర స్వామి (తాతగుడి)కి తరలివెళ్లి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఉత్సవ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక పద్య నాటకం భక్తులను ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం స్వామి వారికి బిందె తీర్థం, హోమం, బలిహరణ, సాయంత్రం హోమం, బలిహరణ, మహా కుంభం నిర్వహించారు. ఇదిలా ఉండగా, ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు అమావాస్య స్నానాలకు క్షేత్రానికి వేలాదిగా తరలివస్తున్నారని ఉత్సవాల నోడల్ అధికారి జవహర్ బాజీ, ప్రత్యేకాధికారి నాగ సురేష్ చెప్పారు. పిండ ప్రదానాలు, పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు తమ్మిలేరులోనూ, జల్లు స్నానాల వద్ద స్నానాలు ఆచరించి స్వామిని దర్శించు కుంటున్నారు. ముసునూరు ఎస్సై పి.వాసు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరంలో 750 మందికి వైద్య పరీక్షలు చేశారు. సర్పంచ్ రావు ప్రవీణ, సుధాకర్ దంపతులు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ నల్లూరి సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అక్కాచెల్లెమ్మలకు అండగా వైఎస్సార్ సీపీ



జోగన్నపాలెం అడ్డరోడ్డు నుంచి ముండూరుకు వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



ముండూరు సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: దెందులూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా, మొదటి విడతగా సుమారు 17 వేల మంది అక్కాచెల్లెమ్మలకు సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నదేనని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం జోగన్నపాలెం వంతెన నుంచి ముండూరు వరకు పార్టీ శ్రేణులతో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ముండూరు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు జై జగన్, జై అబ్బయ్య చౌదరి నినాదాలతో అక్కాచెల్లెమ్మలు స్వాగతం పలికారు. ఇందులో భాగంగా పెదవేగి మండలానికి సంబంధించి 5,062 మంది అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద రూ.9,49,12,500 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ తర్వాత, ఇప్పుడు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750 అందిస్తూ సీఎం వైఎస్ జగన్ అక్కాచెల్లెమ్మలకు అండగా నిలిచారన్నారు. ఈ ఒక్క పథకం ద్వారానే జగనన్న రూ.75 వేలు అందించారని మహిళలకు గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా, దెందులూరులో మొదటి విడతగా సుమారు 17 వేల మంది అక్కాచెల్లెమ్మలకు సొంతింటి కలను నెరవేర్చిన ఘనత జగనన్నదేనని ఎమ్మెల్యే అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం, ప్రతి హామీని సీఎం జగనన్న నిలబెట్టుకున్నారన్నారు. అలాగే గత చంద్రబాబు ప్రభుత్వంలో 600 హామీలు ఇచ్చి చివరకు మ్యానిఫెస్టోనే కనిపించకుండా చేసిన తీరును అక్కాచెల్లెమ్మలు గమనించి ఏ ప్రభుత్వం కావాలో కోరుకోవాలని మహిళలకు కోరారు. ప్రతి పేదవాడికీ లబ్ధి చేకూర్చే జగనన్న ఒక పక్కన, మాయ మాటలతో మోసం చేసే వాళ్లు ఇంకోపక్కన ఉన్నారని, ఎంత మంది ఒక్కటైనా వచ్చినా అక్కాచెల్లెమ్మల ఆశీస్సులు జగనన్నకే ఉన్నాయన్నారు. మహిళల అవసరాలపై ఆలోచించడమే కాక, వారికి చిన్నకష్టం కూడా రాకుండా ఆదుకుంటున్న జగనన్నకు మరోసారి అక్కాచెల్లెమ్మలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి



తోలాపు దుర్గాప్రసాద్ మృతదేహం

పోలవరం రూరల్ : ఎదురెదురుగా రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన తోలాపు దుర్గాప్రసాద్ (20), మరో ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం పట్టిసంలో మహాశివరాత్రి ఉత్సవాలకు బైక్‌పై వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా, పోలవరం మండలం గూటాల పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మిదేవిపేటలో మలుపు వద్దకు వచ్చేసరికి వీరి ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తోలాపు దుర్గాప్రసాద్, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వీరిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికీ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. శనివారం ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కె.శ్రీనివాస్ చెప్పారు.